నిత్యం వంచన.. దుర్మార్గపు పాలన



ఎన్నికల ముందు కూటమి నేతల హామీల వర్షం

- గెలిచాక పట్టించుకోని వైనం
- 3 సిలిండర్ల పథకం తుస్సు
- అతీ గతీ లేని ఆడబిడ్డ నిధి
- కానరాని నిరుద్యోగ భృతి
- అదృశ్యమైన రేషన్ వాహనం

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో తమకు అధికారం కట్టబెడితే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊదరగొట్టారు. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు, మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.1500 జమ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో ప్రజలు నమ్మారు. ఓట్లేసి గెలిపించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా మొహం చాటేస్తున్నారు. ఇచ్చిన హామీలకు ఇంత వరకు అతీగతీ లేకుండా పోయింది. ఇంటి ముంగిట్లోకి వచ్చి సరుకులు ఇచ్చే రేషన్ వాహనాలను తొలగించారు. గత అయిదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలలో చెప్పినవే కాకుండా చెప్పనవి కూడా పక్కాగా చేసి చూపించారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



జగనన్న హయాంలో ఇంటి ముంగిటకు వచ్చే రేషన్ వాహనం నేడు అదృశ్యమైంది (ఫైల్)

ఉచిత బస్సు ఉన్నట్టా.. లేనట్టా..?



ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పింది. ఈ హామీపై కూటమిలోనే ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఆగస్టు 15 నుంచి అని గత ఏడాది చెప్పుకొచ్చారు. ఏడాదైంది. మరలా ఆగస్టు 15 అంటున్నారు. అసలు ఉచిత బస్సు ప్రయాణం ఉన్నట్టా? లేనట్టా? ఎన్నికల ముందు ఇచ్చిన హామీ హుళక్కేనా?

– మరడాన మంగ, మహారాణిపేట

మూడు సిలిండర్ల హామీ అంతా గ్యాస్..

ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు పేదలంతా సిలిండర్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరో కొందరికి ఒక టెర్మ్ పడ్డాయని వినికిడి. మిగిలిన వారి మాటేమిటి? ఎన్నికల సందర్భంగా ఇచ్చిన గ్యాస్ హామీ మాత్ర మేనని ప్రజలకు అర్థమవుతోంది. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేసి పేదలను ఆదుకోవాలి.

– బోర వెంకటలక్ష్మి, వన్‌టౌన్

తల్లికి వందనం కొందరికేనా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలు స్కూల్‌కు వెళ్తే అందరికీ రూ.15 వేలు వంతున ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటాకా మొక్కుబడిగా కొందరికే వేసి చేతులు దులుపుకున్నారు. అందరికీ పథకం వర్తింపజేయాలి.

–సారిక దైవకుమార్, ప్రైవేట్ స్కూల్ టీచర్, 37వ వార్డు

ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇవ్వండి..



సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామన్నారు. అధికారం చేపట్టి దాదాపు పద్నాలుగు నెలలు కావచ్చింది. ఎక్కడా ఆ విషయం మాట్లాడటం లేదు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఇవ్వకపోతే తిరగబడడం ఖాయం.

– వర్రి నాగ అరుణ్‌కుమార్, నిరుద్యోగి, 29వ వార్డు

దక్షిణ నియోజకవర్గంలో సూపర్ సిక్స్ పథకాలకు అర్హుల వివరాలు

అమ్మకు వందనం..

- ✓ గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమ్మ ఒడి కింద 19,360 మందికి రూ.72.08 కోట్లు, విద్యా దీవెన కింద 12,817 మందికి రూ.37.10 కోట్లు కేటాయించారు.

నిరుద్యోగ భృతి..

- ✓ కూటమి ప్రభుత్వంలో సుమారుగా 40,988 మంది అర్హత గల యువతకు నెలకు అందాల్సిన నిరుద్యోగ భృతి రూ.12.29 కోట్లు.

ఉచిత గ్యాస్ సిలిండర్లు..

- ✓ నియోజకవర్గ పరిధిలో సుమారుగా అర్హులైన 43,038 మందికి ఏడాదికి 3 సిలిండర్ల చొప్పున 1,29,114 సిలిండర్లు అందజేయాలి. కొందరికే పడింది. అదీ ఒక టెర్మ్ మాత్రమే.

ఉచిత బస్సుకు అర్హులు..

- ✓ నియోజకవర్గం నుంచి 1,35,000 మంది మహిళలు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



నీలాపు లక్ష్మిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నీలాపు లక్ష్మి బుధవారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాసుపల్లి లక్ష్మిని సత్కరించారు. తనను ఈ పదవిలో నియమించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుకు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లికి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారికి, 29వ వార్డు ప్రెసిడెంట్ పీతల వాసుకి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

శక్తియాప్‌పై అవగాహన



వైద్య విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కళాశాల విద్యార్థినులు, నర్సింగ్, మహిళా వైద్య సిబ్బందికి శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. కేజీహెచ్‌లో బుధవారం మహిళలపై జరుగుతున్న దాడులు, సైబర్‌క్రైమ్ గురించి వన్‌టౌన్ సీఐ జీడీ బాబు అవగాహన కల్పించారు.

అనాటమీ విభాగానికి అభాగ్యుడి మృతదేహం



మృతదేహాన్ని అప్పగిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో అనారోగ్యంతో మృతి చెందిన అభాగ్యుడి మృతదేహాన్ని వైద్యుల పరిశోధనకు అనాటమీ విభాగానికి వన్‌టౌన్ పోలీసులు బుధవారం అందజేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వన్‌టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

పూజా సామగ్రి దుకాణం దగ్ధం



స్ప్రింగ్‌రోడ్డులో దగ్ధమైన దుకాణం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు స్ప్రింగ్‌రోడ్డులో ఓ పూజా సామగ్రి దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. మంగళవారం రాత్రి దుకాణ యాజమాని శ్రీకాంత్ యథావిధిగా దుకాణం మూసేసి ఇంటికెపోయారు. తెల్లవారి మూడు గంటల సమయంలో దుకాణంలో నుంచి మంటలు రావడంతో సమీపంలో ఉన్న వారు అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియపరిచారు. దీంతో అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే సామగ్రి కాలిపోవడంతో సుమారు రూ. 3 లక్షల నష్టం వాటిల్లిందని దుకాణ యాజమాని తెలిపారు.

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో మరమ్మతులు చేపడతాం

ఏయూక్యాంపస్: పర్యాటకులు, వాకర్లకు మరింత ఉపయుక్తంగా నిలిచే విధంగా వీఎంఆర్‌డీఏ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని కమిషనర్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం ఉదయం మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్లతో మాట్లాడారు. పార్క్‌లో పలు నిర్వహణ సంబంధమైన పనులు ఉన్నాయని, వాటి మరమ్మతులను మూడు వారాల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేసామని, త్వరలో మిగతా పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

32వ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏడుగుళ్ల మురికివాడ ప్రజలు

అల్లిపురం: దీర్ఘకాలికంగా తిష్ట వేసుకుని ఉన్న 32వ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజుతో కలిసి నేరెళ్ల కోనేరు, సీపీఐ ఆఫీస్ రోడ్డు, ఏడుగుళ్ల స్లమ్ ఏరియా, అల్లిపురం మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. వార్డులో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, సీఎంవోహెచ్ కృష్ణంరాజు, ఎస్.ఎస్. కిషోర్, ఎమ్మార్వో జిలానీ, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ ఇన్చార్జి కీర్తి, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీ, సూపర్‌వైజర్లతో పాటు స్థానిక నాయకులు ఎం.శాలివాహన, సీపీఐ బుజ్జి, అప్పారావు, టి.శివ, నాగేంద్ర, బి. అప్పారావు, వీరు, మల్ల శ్రీను, కె.మణి, కేదార్నాథ్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ఆర్థిక భారం



స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని బంగారుమెట్టలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

అల్లిపురం: స్మార్ట్ మీటర్లు పెడితే కరెంట్ బిల్లు విపరీతంగా వచ్చి ప్రజలకు ఆర్థిక భారం ఎక్కువవుతుందని, ఈ దురాగతాన్ని అడ్డుకోవాలని సీపీఎం జగదాంబ జోన్ పార్టీ కన్వీనర్ ఎం. సుబ్బారావు, వై.రాజులు ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ నేత కె. గణేష్ ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నీలమ్మ వేపచెట్టు, అల్లిపురం ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు కరపత్రాలు పంచి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇదే కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు ఇప్పుడున్న మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అని పిలుపునిచ్చి ఇప్పుడు వాటినే పెట్టించాలనుకోవడం దుర్మార్గమన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పయ్యావుల కేశవ్ ప్రభుత్వంపై కేసు వేశారన్నారు. నేను ప్రశ్నిస్తాను అని చెప్పిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎక్కడున్నారో కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో జగదాంబ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్, చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె. నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 125వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. బుధవారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1 శుక్రవారం సాయంత్రం స్లీప్‌గుర్తు మండపంలో విశాఖ అగ్రపీఠం పరిపాలనాధికారి బిషప్ పాలిమేర జయరావు పతాకావిష్కరణ చేస్తారని, అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలు వీధుల్లో తిరుగుతుందని, 15న విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల ఆధ్వర్యంలో ప్రధాన ఉత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి.విమల్‌రాజ్, ఫాదర్ వై.ప్రేమ్‌కుమార్, పీపీసీ అధ్యక్షుడు ముసిరి రాజేష్, కమిటీ సభ్యులు మరియరత్నం, ఫ్రాన్సిస్, గురు మండలి సలహా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన తప్పనిసరి



సేక్రెడ్ హార్ట్ పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్



సెయింట్ జోసెఫ్ పాఠశాల వద్ద అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న పోలీస్ సిబ్బంది

కంచరపాలెం: విద్యార్థి దశ నుంచే సమాజంపై పూర్తి అవగాహన ఉండాలని కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ అన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్స్ బాలికల ఇంగ్లీష్ మీడియం స్కూల్, సేక్రెడ్ హార్ట్ బాలికోన్నత పాఠశాల బుధవారం విద్యార్థులకు పిల్లల అక్రమ రవాణా, సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. సీఐ రవికుమార్ మాట్లాడుతూ చిన్న వయసులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఉంటాయన్నారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవద్దని, అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తెలియజేయాలని అన్నారు. పిల్లలు సోషల్ మీడియాలో ఏం చూస్తున్నారో, ఏం చేస్తున్నారో గమనిస్తూ నిరంతరం గమనించాలన్నారు. అనంతరం సెయింట్ జోసెఫ్ పాఠశాల నుంచి జ్ఞానాపురం బరియల్ స్ట్రీట్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు అజయ్, అరుణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రెవరెండ్ సిస్టర్ మేరీ రోస్, రెవరెండ్ సిస్టర్ మేరీ హెలెన్, రెవరెండ్ సిస్టర్ వేళంగిణి, అగ్నస్ ఆనందిని, రెవరెండ్ సిస్టర్ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



కంకణ ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30కి స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణలక్ష్మి పూజలు



భక్తుల పూజలందుకుంటున్న సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం నాటికి 6వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఆర్‌హెచ్‌ఈడీఎస్ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు

అల్లిపురం: ఏఆర్‌హెచ్‌ఈడీఎస్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ మిషన్ డైరెక్టర్, మెప్మా ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమస్యపై రాష్ట్ర స్థాయిలో ఎన్‌జీవోస్ కార్యక్రమాల గురించి ఏఆర్‌హెచ్‌ఈడీఎస్ డైరెక్టర్ రామకృష్ణ పూర్తి వివరాలు తెలియజేశారు. అలాగే డే – నైట్ షెల్టర్ల ద్వారా చేస్తున్న పునరావాస కార్యక్రమాలను ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వివరించారు.

సమాచార శాఖ వాహనానికి బహిరంగ వేలం

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖపట్నం కార్యాలయంలోని ఓపెన్ టాప్ వాహనానికి ఆగస్టు 18వ తేదీ ఉదయం 11 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలపరిమితి ముగిసి, నిరుపయోగంగా ఉన్న స్వరాజ్ మజ్దా ఓపెన్ టాప్ ఏపీ 31 టీయు 1495 (2008 మోడల్) వాహనాన్ని బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000 ధరావతు సొమ్ము చెల్లించాలని, వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో పాటు మొత్తం నగదు వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యాలయ పని వేళల్లో వాహనాన్ని పరిశీలించుకోవచ్చన్నారు. వేలం వేయడం, రద్దు చేసే అధికారం కార్యాలయ అధికారికి ఉందని, వివరాలకు 9642714155 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

పార్కుల్లో అపారిశుధ్యంపై జెడ్సీ అసంతృప్తి



లలితానగర్ పార్కును పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: పార్కుల్లో పారిశుధ్యం నిర్వహణపై జెడ్సీ మల్లయ్యనాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన జోన్–4 పరిధి లలితానగర్, గొల్లలపాలెం ప్రాంతాల్లో పర్యటించారు. పార్కుల్లో చెత్తను చూసి వార్డు ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం వార్డులో కాలువలు పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ చెత్త సేకరణ వాహనాలు వస్తున్నాయా అంటూ మహిళలను ప్రశ్నించారు. పారిశుధ్యం పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నా విజయవంతానికి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7న 'ఛలో విజయవాడ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సిటు కార్యాలయంలో చలో విద్యుత్ సౌధా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సబ్ స్టేషన్ ఆపరేటర్స్, పిక్ లోడ్, సెక్షన్ ఆపరేటర్లు, ఏటీపీ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, స్టోర్స్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న హమాలీలు పని చేస్తున్నారని తెలిపారు. వీరందర్నీ రెగ్యులర్ చేస్తామని అనేక సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఆగస్టు 7న చేపట్టే మహాధర్నాకు కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, ఎస్.అవతారం, సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని వేధించే సమస్య మానవ అక్రమ రవాణా



మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న సకల్య సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 30వ వార్డులో 'సకల్య' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరమని, ఈ దోపిడీని అంతం చేయాలంటూ నినదిస్తూ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని విశాఖ ఫుట్‌పాత్ వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రబిల్లి ప్రభాకరరావు ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ సర్వీస్ ప్యానల్ అడ్వకేట్ పి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా గురించి అవగాహన పెంచడం, నేరాన్ని నిరోధించడానికి, ఎదుర్కొనే చర్యలను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించడానికి జిల్లా లీగల్ సర్వీస్ బాధితులకు అండగా నిలుస్తుందన్నారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేసే తీవ్ర సమస్య అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దోపిడీ, అక్రమ రవాణా నుంచి సురక్షితంగా ఉండే ప్రపంచాన్ని సృష్టించడానికి కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

బాబు మోసాలపై ఇంటింటి ప్రచారం



స్ప్రింగ్‌రోడ్డులో ప్రచారం చేస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

జగదాంబ: సూపర్ సిక్స్ పథకాలు అంటూ కూటమి నాయకులు ప్రజలను నమ్మించి మోసగించారని 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అలపన కనకరెడ్డి విమర్శించారు. వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీల గురించి ప్రజలకు వివరించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, నాగిరెడ్డి, శేఖర్, రవికుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.